ప్రజాశక్తి
బుధవారం 30 జులై 2025 5 అనంతపురం



బంగారు కుటుంబాలకు బాసటెవరు..!

◆ మార్గదర్శకులవ్వాలని అధికారులపై ఒత్తిడి ◆ బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల మధ్య కుదరని లంకె



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో పేదరికం లేకుండా చేస్తానంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు పి4 పేరుతో కార్యచరణను రూపొందించింది. సర్వే పేరుతో అత్యంత పేదరికంలోనున్న కుటుంబాలను గుర్తించింది. ఆ కుటుంబాలకు 'బంగారు కుంటుంబాలు' అని నామకరణం కూడా చేసింది. దీనికి ప్రభుత్వపరంగా అందించే సహాయం కంటే సంపద కలిగున్న వారు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారికి అవసరమైన ఆర్థిక, ఇతర తోడ్పాటును అందించి పేదరికం నుంచి గట్టెక్కించాలన్నది ప్రభుత్వం లక్ష్యం. ఆచరణలో చూసినప్పుడు బంగారు కుటుంబాలకు దత్తత తీసుకునే మనసున్న మారాజులు ఇప్పుడు కనిపించడం లేదు. దీంతో బంగారు కుటుంబాలు ఎప్పటిలాగానే దిక్కులేని కుటుంబాలుగానే ఉంటున్నాయి.

అనంత జిల్లాలో 26 శాతమే దత్తత

అనంతపురం జిల్లాలో 68,381 బంగారు కుటుంబాలున్నట్టు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. 2,02,492 మంది ఈ కుటుంబాల పరిధిలోనున్నారు. ఇందులో ఇప్పటి వరకు దత్తత తీసుకున్న కుటుంబాలు చూస్తే 18,397 కుటుంబాలున్నాయి. 49,984 మందిని దత్తత తీసుకున్నారు. ఇప్పటి వరకు దత్తత తీసుకున్న మార్గదర్శకులు ఎంతమంది అని చూస్తే 2744 మంది ఉన్నారు. ఈ లెక్కల్లోనూ తప్పులున్నట్టు అధికారులు భావిస్తున్నారు. బంగారు కుటుంబాల మార్గదర్శకులుగా నమోదు చేసే సమయంలో తప్పిదాలు జరిగి ఈ సంఖ్య ఎక్కువగా నమోదయినట్టుగానూ తెలుస్తోంది. ఈ లెక్క ప్రకారం చూసుకున్నా ఇప్పటి వరకు 26 శాతం కుటుంబాలకే మార్గదర్శకులు ముందుకొచ్చారు.

అధికారులే ఎక్కువ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ కార్యచరణ అమలు బాధ్యత ఎక్కువగా అధికారులపైనే పడుతోంది. అధికారులకు ప్రత్యేకంగా ఉన్నతాధికారులు లక్ష్యాలు కూడా పెట్టారు. ఒక్కో అధికారి, ఉద్యోగి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని చెప్పడంతో విధిలేని పరిస్థితుల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. అక్కడక్కడా అధికార పార్టీ నేతలు కూడా కొంత మంది మార్గదర్శకులుగా పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ పనుల కోసం వెలుతున్న వారిపైనా కూడా మార్గదర్శకులవ్వాలన్న ఒత్తిడిని అధికారులు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇష్టపూర్వకంగా చేయాల్సిన పనిని బలవంతంగా చేయించడం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మార్గదర్శకులు, బంగారు కుటుంబాల మధ్య కుదరని లంకె

బంగారు కుటుంబాల దత్తత విషయంలో ఉన్నత స్థాయి నుంచి ఒత్తిళ్లు రావడంతో పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంలో బంగారు కుటుంబాలకు ఏమి అవసరమో కూడా పరిశీలించకుండా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. మార్గదర్శకుల ద్వారా తమకు ఏ మేరకు తోడ్పాటు లభిస్తుందో అన్నది కూడా బంగారు కుటుంబాకు



తెలియడం లేదు. ఎవరికి వారు అన్నట్టుగా రికార్డుల్లో మాత్రమే నమోదయి ఉన్నాయి. బంగారు కుటుంబాల అవసరాలేమిటో కూడా మార్గదర్శకులకు తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పి-4 బంగారు కుటుంబాల అంశం ఏ మేరకు ముందుకు సాగుతున్నది ప్రశ్నార్థకంగానే మారింది.

ఆలయాలే.. లక్ష్యం..!



◆ వరుస చోరీలతో పోలీసులకు సవాల్
◆ రుద్రంపల్లిలో పట్టుబడ్డ గుప్తనిధుల నిందితులు
◆ మత్తువదలని దేవాదాయ శాఖ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణ దుర్గం నియోజకవర్గంలో ఆలయాలే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతున్నారు. గత రెండు నెలలుగా పలు ఆలయాల్లో చోరీలు జరిగాయి. అమ్మవారి నగలు, హుండీ ధ్వంసం చేయడం లాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ చోరీలు పోలీసులకు సవాల్‌గా మారాయి. ఇటీవల కుందుర్పి మండలం రుద్రంపల్లిలో బీసల మల్లప్ప గుడిలో గుప్తనిధుల తవ్వకాలు జరుపుతుండగా నిందితులు పట్టుబడ్డారు. ఇలా ఆలయాలను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఆలయాల భద్రతను చూసుకోవాల్సిన దేవాదాయ శాఖ నిర్లక్ష్యంగా మత్తులో జోగుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆదాయం తెచ్చిపెట్టే ఆలయాలు, వాటికి ఉన్న వనరులతో చేకూరే ఆదాయం లాంటి చోట్ల కనీసం సీసీకెమెరాలు కూడా దేవాదాయ శాఖ ఏర్పాటు చేయలేదు. పోలీసులు పలుమార్లు గ్రామస్తులు, దేవాదాయ శాఖ అధికారులకు సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని సూచనలు ఇచ్చినా వారు పెడిచెవిన పెట్టారు.

ఇటీవల జరిగిన చోరీలు ఇలా..

కుందుర్పి మండలం రుద్రంపల్లి సమీపంలో బీసల మల్లప్పగుడి వద్ద గుప్తనిధులున్నాయని అదేగ్రామానికి చెందిన కొందరు అనంతపురంలో తెలిసిన వారికి సమాచారం అందించారు. గుప్తనిధుల కోసం అన్వేషించే బృందం సభ్యులైన కొందరు కేరళ రాష్ట్రానికి చెందిన గుప్తనిధుల తవ్వకాల్లో ఆరితేరిన వారిని పిలిపించుకున్నారు. రుద్రంపల్లి, కంబదూరు, కేరళ, ధర్మవరం అనంతపురానికి చెందిన గుప్త నిధుల నింధితులు ఆలయం వద్ద తవ్వకాలు చేస్తుండగా పోలీసులకు సమాచారం వెళ్లడంతో వారందరినీ పట్టుకున్నారు. ఒక జేసీబీ, రెండు కార్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ 12 మందిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. గత శనివారం అర్ధరాత్రి పొద్దు పోయాక కంబదూరు మండలం తిమ్మాపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. అంతకు ముందు వారంలో గోళ్ల గ్రామం మారెమ్మ ఆలయంలో 16 వెండి గొడుగులు, అమ్మవారికి చెందిన వెండి ముఖం సుమారు రూ.1.50లక్షలు విలువ చేసే ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లారు. బోరంపల్లి గ్రామంలో మారెమ్మ, సుంకలమ్మ ఆలయాల్లో అమ్మవారి మంగళసూత్రాలను దోచుకెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి మున్సిపాలిటీ పరిధిలోని మల్లికార్జునపల్లి గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో దొంగలు హుండీ పగలగొట్టి అందులోని రూ.10వేలు నగదు ఎత్తుకెళ్లారు. ఇవి బయటకు వచ్చిన చోరీలు మాత్రమే ఇంకా చాలాచోట్ల ఆలయాల్లో చోరీలు బహిర్గతం కాలేదనే ప్రచారం ప్రజల్లో ఉంది. ఇప్పటికైనా పోలీసులు, దేవాదాయ శాఖ అధికారులు ఆలయాల్లో దొంగతనాల నివారణకు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తిమ్మాపురం నరసింహస్వామి ఆలయంలో హుండీ ధ్వంసం (ఫైల్)

'తప్పు చేయకున్నా ఒప్పుకోమన్నారు'..!

◆ దొంగతనం, హత్యాయత్నం కేసు యువకుడు ఆత్మహత్య
◆ కావాలనే ఇరికించారంటూ సెల్ఫీవీడియో
◆ మృతుని కుటుంబ సభ్యుల ఆందోళన



నవీన్(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-తలుపుల

దొంగతనం, హత్యాయత్నంకు పాల్పడుకున్నా, తానే చేసినట్లు ఒప్పుకోమని అకారణంగా నింద మోపారని ఆరోపిస్తూ ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకుని తన ఆవేదన వ్యక్తం చేశాడు. అకారణంగా తనను కొట్టడంతో మనస్తాపానికి లోనై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు అందులో తెలియజేశారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం పులిగుండ్లపల్లి పంచాయతీ రాజనాలపల్లి గ్రామంలో చోటు చేసుకున్న ఈఘటన ఉద్రిక్తతలకు దారి తీసింది. ఇందుకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

తలుపుల మండలం పులిగుండ్లపల్లి పంచాయతీకి సర్పంచిగా వైసిపి మద్దతుదారురాలు సుగుణమ్మ వ్యవహరిస్తున్నారు. ఈమెది ఈ పంచాయతీ పరిధిలోని రాజనాలపల్లి గ్రామం. ఇదే గ్రామానికి చెందిన నవీన్(24) టిడిపి సానుభూతిపరునిగా ఉన్నారు. సోమవారం రాత్రి సర్పంచి తన ఇంటి వద్ద ఉండగా నవీన్ అటుగా వెళ్లాడు. ఈ సమయంలో తనపై దాడి చేసి తన మెడలోని బంగారు గొలుసును నవీన్ ఎత్తుకెళ్తున్నాడంటూ సర్పంచి కేకలువేసింది. దీంతో అక్కడున్న వారు నవీన్‌ను పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గ్రామానికి చేరుకుని నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనకేమీ సంబంధం లేదని చెప్పడంతో పోలీసులు మంగళవారం నాడు విచారిద్దామంటూ స్టేషన్ నుంచి బయటకు పంపారు.

సెల్ఫీ వీడియో.. ఆత్మహత్య..

చోరీ, హత్యాయత్నం ఆరోపణలు ఎదుర్కొంటున్న నవీన్‌కుమార్ శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బహిర్భూమికి ఊరి బయటకు వెళ్లాడు. ఇదే సమయంలో ఓ సెల్ఫీవీడియో విడుదల చేశాడు. అకారణంగా తనపై దొంగతనం కేసు వేయడంతో పాటు, తనను కొట్టారని, తన వద్ద బంగారు గొలుసు లేదని చెబుతున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. పోలీసులు కూడా నేరం చేసినట్లు ఒప్పుకోవాలని ఒత్తిడి చేశారంటూ సెల్ఫీవీడియోలో తెలియజేశారు. అనంతరం అక్కడే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

కుటుంబ సభ్యుల ఆందోళన

తమ కుమారుడి ఆత్మహత్యకు సర్పంచి కుటుంబ సభ్యులే కారణం అంటూ నవీన్ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సర్పంచి ఇంటి వద్ద బైటాయించి నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలంటూ పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. చట్టప్రకారం న్యాయం చేస్తామని ఎస్ఐ కె.నరసింహుడు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

'ఉపాధి' పనులు పరిశీలన

పుట్లూరు : మండలంలోని మడ్డిపల్లి గ్రామ పంచాయతీ చేపట్టిన ఉపాధి హామీ పనులను ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఫారంపాండ్ పనులు చేస్తుండగా కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎక్కువగా ఫారంపాండ్ పనులే చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఎం.తులసీప్రసాద్, ఇసి అంజన్‌కుమార్, సాంకేతిక సహాయకులు శంకర్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

నీరున్నా తప్పని ఎద్దడి..!

దుర్గం వాసులకు తాగునీటి కష్టాలు - ఐదు రోజులకోసారి సరఫరా



కనేకల్ ఎస్ఎస్ ట్యాంక్‌లో పుష్కలంగా ఉన్న నీరు



నీటి కోసం చెక్‌పోస్టు సమీపంలో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-రాయదుర్గం

సమ్మర్ స్టోరేజీలో సంవృద్ధిగా నీరున్నా రాయదుర్గం పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి తప్పడం లేదు. ప్రస్తుతం ఎస్ఎస్‌ట్యాంకులో రెండున్నర నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయి. తుంగభద్ర రిజర్వాయర్ నుంచి ఎగువ కాలువకు నీటిని గత వారం విడుదల చేశారు. ఎగువ కాలువ నుంచి కనేకల్ వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు నీటి పంపింగ్‌ను స్థానిక శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప ఇటీవల ప్రారంభించారు. నీటి సరఫరా నిర్వహణలో లోపం కారణంగా ప్రజలకు ఆ నీరు పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదు. కనీసం రోజు విడిచి రోజు నీరు విడుదల చేయాల్సి ఉండగా నాలుగైదు రోజులకు ఓసారి గాని పట్టణంలో కుళాయిలకు నీరు రావడం లేదు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, మోటార్లు కాలిపోవడం, పైప్‌లైన్ లీకేజీ, మరమ్మతులతో నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతూనే ఉన్నాయి. ఈ సమస్యల నేపథ్యంలో ఒక్కోసారి వారానికి ఓసారి కూడా నీటి సరఫరా కావడం లేదు. తాగునీటి పథకం చేపట్టి 15 సంవత్సరాలు కాగా ఇప్పటికీ పంపింగ్ పైప్‌లైన్‌లో అనేక చోట్ల లీకేజీలు ఉన్నాయి. వీటిని మరమ్మతు చేయడం వ్యయప్రయాసలతో కూడుకున్నది కావడంతో సమస్య అంత సులువుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. మోటార్లు కాలిపోతే వాటిని స్థానికంగా మరమ్మతు చేసే వారు లేరు. బళ్లారికి తీసుకెళ్లాల్లి వీటిని మరమ్మతు చేయించాలి. ఒక్కో మోటార్ మరమ్మతుకు కనీసం లక్ష రూపాయలు ఖర్చు అవుతుంది. అత్యవసర దృష్ట్యా మరమ్మతులు చేసిన వెంటనే బిల్లుల చెల్లింపు జరగదు. దీంతో మోటార్లు మరమ్మతు చేసేందుకు మెకానిక్‌లు ముందుకు రావడం లేదు. రెండు దశాబ్దాల పాటు సంతృప్తికరంగా సేవలందించాల్సిన ఈ పథకం మరో ఐదేళ్లు గడువు ఉన్నప్పటికీ అనేక చోట్ల పైప్‌లైన్ లీకేజీ కారణంగా సక్రమంగా నీటి సరఫరా జరగలేదు. స్టాండ్బై మోటార్లు ఉన్నప్పటికీ సమస్య తీరడం లేదు. నీటి పథకం కోసం ప్రత్యేక హెచ్‌టి విద్యుత్ లైన్ ఏర్పాటు చేసినా ఈ లైన్ నుంచే గ్రామీణ వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో లోడ్ అధికమై లోవోల్టేజీతో మోటార్లు తరచూ కాలిపోతున్నాయి. తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా అమత 2.0 కార్యక్రమంలో భాగంగా రూ.76 కోట్లతో కొత్త పైపులైన్ ఏర్పాటుకు అధికారులు అంచనాలు రూపొందించారు. అది ఎప్పటికి కార్యరూపం దాలుస్తుందన్న దానిపై స్పష్టత లేదు.

కాలనీవాసులు ఆందోళన

తాగునీటి ఎద్దడి తీవ్రం కావడంతో మంగళవారం నాడు రాయదుర్గం పట్టణం మల్కలమూరు రోడ్డు వద్ద సున్నం బట్టీలు, చెక్‌పోస్టు, కోట మారమ్మ గుడి వద్ద స్థానికులు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై ఖాళీ బిందెలతో బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. తమ కాలనీలకు పది రోజులైనా నీరు సరఫరా చేయడం లేదని, ట్యాంకర్ల ద్వారా పంపే నీరు చాలడం లేదంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న మున్సిపల్ ఇంజినీర్ నరసింహులు, ఫిట్టర్ జగన్నాథ సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లి వారితో మాట్లాడారు. లోవోల్టేజ్ కారణంగా మోటార్లు కాలిపోయాయని, వాటిని మరమ్మతు చేయించి సమస్య పరిష్కరిస్తామన్నారు. అంత వరకు టాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీటి వనరులు ఉపయోగించి కనీసం రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేయాలని పట్టణవాసులు అధికారులను కోరారు.

'పి-4'ను నిర్బంధం చేస్తే బహిష్కరిస్తాం

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిరో పావర్టీ (పి-4) కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థి కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకోవాలంటూ విద్యాశాఖ అధికారులు నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య తెలిపారు. ఈమేరకు మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో అనంతపురం డిఇఒ ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన పేరుతో ముఖ్యమంత్రి ప్రారంభించిన పి-4 కార్యక్రమంలో సంపన్నులు ముందుకు వచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని, సిఎం చేపట్టిన కార్యక్రమానికి పెద్దగా స్పందన రాకపోవడంతో ఇప్పుడు ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై నెడుతున్నారన్నారు. పి-4 విధానంలో భాగంగా ప్రతి ప్రధానోపాధ్యాయుడు కనీసం 5 కుటుంబాలను, ఉపాధ్యాయులు 2 కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకుని ఆన్‌లైన్ రిజిష్టర్ చేయాలని విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులకు లింక్‌లు పంపి రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని పదేపదే ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సుబ్బరాయుడు, చంద్రమోహన్, కోటేశ్వరప్ప, శ్రీనివాసులు, ముసలప్ప, పవన్ కుమార్, డీకే నారాయణ, రమేష్, మహమ్మద్ గౌస్, సిద్ధన్న, షాహిదా, సాజిద, అయాజ్, అమీన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీని జయప్రదం చేయండి

రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

వచ్చేనెల 4, 5వతేదీల్లో శింగనమలలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులుక బంగి శివ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇందుకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలకు శ్రీకారం చుట్టేందుకు ప్లీనరీలో ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కేంద్రంలో 3వసారి అధికారంలో వచ్చిన బిజెపి ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేయడానికి నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ విధానంతో దేశవ్యాప్తంగా విద్యను కాషాయీకరణ, ప్రయివేటీకరణ చేసేందుకు పూనుకుందన్నారు. ఇప్పటికే దేశంలోని అన్ని సెంట్రల్ యూనివర్సిటీల్లో ఆర్ఎస్ఎస్ వాదులను ప్రొఫెసర్స్‌గా నియమించారని ఆరోపించారు. అదేవిధంగా సంక్షేమ హాస్టళ్లకు కాస్మొటిక్ ఛార్జీలు విడుదల చేయడం లేదన్నారు. యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆయా సమస్యలపై భవిష్యత్తులో పోరాటాలు చేసేందుకు ప్లీనరీలో ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, శ్రీ సాయి వల్లి, ముత్తప్ప, కిరణ్‌కుమార్, ఆదర్శ్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కొలుసు పార్థసారథి పర్యటన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈమేరకు మంగళవారం మండల పరిధిలోని చాపిరి గ్రామంలో ఆర్‌డిఒ వసంతబాబు, హౌసింగ్ పీడీ శైలజ, తహశీల్దార్ భాస్కర్, హౌసింగ్ డిఇ విజయబాస్కర్, ఎఇ లోకనాథ్‌చౌదరి, తదితరులు పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గంలో సుమారు రూ.3 కోట్లు అభివృద్ధి పనులకు భూమిపూజ, వాల్మీకి సర్కిల్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సొంత నిధులు రూ.50లక్షలతో, రూ.2.20కోట్లతో పాతబస్టాండ్ వద్ద డ్రెయినేజీ పనులను ప్రారంభించనున్నారు. మండల పరిధిలోని చాపిరి గ్రామంలో నిర్వహించనున్న 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో పాల్గొంటారు. అదేగ్రామంలో రూ.40లక్షలతో సీసీ రోడ్లు పనులకు భూమిపూజ చేయనున్నారు. మధ్యాహ్నం ప్రజావేదిక వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు. తర్వాత గృహనిర్మాణ శాఖతో పాటు ఇతర అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించనున్నారు.



చాపిరిలో మంత్రి పర్యటనపై స్థానిక అధికారులతో చర్చిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలుపుకోండి

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలుపుకోవాలని ఎస్పీ పి.జగదీష్ సూచించారు. జిల్లాకేంద్రంలోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్ సిబ్బందికి అనంతపురం డిస్కవరీ సహకారంతో అందజేసిన హెల్మెట్లను మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అనంతపురం డిస్కవరీ నిర్వాహకులు అనిల్ ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి 40 హెల్మెట్లు, 14 వెహికల్ వీల్ లాక్‌లను వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిస్కవరీ అనంతపురం నిర్వాహకులు అనిల్‌కుమార్, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ వెంకటేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు జిల్లాలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై చేసిన లాఠీఛార్జిని వ్యతిరేకిస్తూ కళ్యాణదుర్గంలో మంగళవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

మహిళలు, దళితులపై దాడులను అరికట్టాలి

గుత్తి : ఉమ్మడి అనంతపురం జిల్లాలో మహిళలు, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షురాలు కె.సునీత కోరారు. ఈమేరకు మంగళవారం విజయవాడలో ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్‌ను కలిసి విన్నవించారు. జిల్లాలో జరిగిన దాడులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

పారిశుధ్య కార్మికులపై లాఠీఛార్జి అమానుషం

జిల్లావ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలు



అనంతపురం నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నెల్లూరు జిల్లాలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులపైన పోలీసులు లాఠీఛార్జి చేయడం అమానుషమని మున్సిపల్ కార్మికుల యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, తిరుమలేశు, ఓబుళపతి అన్నారు. లాఠీఛార్జి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరులోని 9వ డివిజన్‌లో వర్క్ అవుట్ సోర్సింగ్ పద్ధతి విధులు నిర్వర్తించేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకు కార్మికులు శాంతియుతంగా సమ్మె చేస్తుంటే అమానుషంగా లాఠీఛార్జి చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ సెక్షన్ నాయకులు రాయుడు, మురళి, కమిటీ సభ్యులు బి కోనప్ప, పెన్నోబులేసు, కమల్, హరిప్రసాద్, జయరాం, ఇమాంబి, మంజులమ్మ పాల్గొన్నారు.

రాయదుర్గం : నెల్లూరులో మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై పోలీసుల లాఠీఛార్జిను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం రాయదుర్గంలో పాత మున్సిపల్ కార్యాలయం నుంచి వినాయక కూడలి వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ నెల్లూరులో కార్మికులపై లాఠీఛార్జి చేయడం అమానుషమన్నారు. వెంటనే లాఠీఛార్జి చేసిన సిఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, మున్సిపల్ యూనియన్ నాయకులు రాము, తిప్పేస్వామి, మల్లేష్, ఇంజినీరింగ్ కార్మికులు తిప్పేరుద్ర, మైలారి, నరసింహులు, పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.


గుంతకల్లు : నెల్లూరు నగరంలో శాంతియుతంగా పోరాటం చేస్తున్న పారిశుధ్య కార్మికులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం అమానుషమని సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు కె.నరసయ్య అన్నారు. లాఠీఛార్జిని నిరసిస్తూ మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జగదీష్, నాయకులు దాసు, రంగనాయకులు, ప్రేమ్‌కుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, నాయకులు ఎస్‌కెఎం, బాషా, తిమ్మప్ప, కార్మికులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై జరిగిన లాఠీఛార్జిని నిరసిస్తూ సిఐటియు ఆధ్వరంలో మంగళవారం పట్టణంలోని టి సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు, నాయకులు శివకుమార్, వన్నూరుస్వామి, వెంకటేశులు, కార్మికులు యల్లక్క, దుర్గమ్మ, తిమ్మప్ప, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : నెల్లూరులో పారిశుధ్య కార్మికులపై జరిగిన లాఠీఛార్జిని ఖండిస్తూ గుత్తిలో మంగళవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, కోశాధికారి బాలరంగన్న, ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాజా, రవిశంకర్, ఉపాధ్యక్షుడు ఎస్ఎ మురళి, సహాయ కార్యదర్శి నరసింహ, కోశాధికారి నక్కా శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి విజయంలో కార్యకర్తల శ్రమ మరువలేం

విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



కరపత్రం అందజేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-డి.హీరేహాల్

తెలుగుదేశం పార్టీ విజయంలో కార్యకర్తలు శ్రమ, కష్టం మరువలేనిదని విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని మలపనగుడి, ఓబులాపురం గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుతం చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో వృద్ధులకు పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను అమలు చేశామన్నారు. వచ్చేనెలలో రైతుల ఖాతాల్లో రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంతురెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగలి రాజు, నాయకులు తాయప్ప, వెంకటేశులు, ఎంపీటీసీలు గంగాధర్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ప్లేస్‌మెంట్ డ్రైవ్



ఆన్‌లైన్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మోసచిప్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ క్యాంపస్ హైరింగు ఆన్‌లైన్ ప్రిలిమనరీ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అనలాగ్ అండ్ డిజిటల్ ప్రొఫైల్‌కు 92 మంది విద్యార్థులు ఇసిఇ, ఇఇఇ విభాగాల నుంచి పరీక్ష రాసేందుకు హాజరయ్యారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.6 నుంచి రూ.8 లక్షలు ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, డైరెక్టర్ ఇండస్ట్రీయల్ రిలైషన్స్, ప్లేస్‌మెంట్ ఆర్.కిరణ్మయి, పిల్లలకు ఆన్‌లైన్ పరీక్ష గురించి సూచనలు ఇచ్చినట్లు ప్రాంగణ నియామకాల అధికారి డాక్టర్ జె.శ్రీనివాసులు తెలిపారు.

'దుర్గం'కు సాగు, తాగునీరు, తీసుకురావాలి

పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలి-రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివృద్ధి వేదిక నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

గత కొన్నేళ్లుగా దగాబడ్డ కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సాగు, తాగునీరు తీసుకురావాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మంగళవారం స్థానిక వాల్మీకి భవనంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు నిజవల్లిబాబు అధ్యక్షతన సాగునీటి ప్రాజెక్టులు, విభజన హామీలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి రమణ, జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాములు, కార్యదర్శి సాకే హరి మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రాంతానికి హంద్రీనీవా నీటిని తీసుకొచ్చి 36వ ప్యాకేజీలు కొన్నిచోట్ల, భైరవాని తిప్పప్రాజెక్టు పూర్తి చేసి మరికొన్ని చోట్ల 114 చెరువులకు నీరు నింపాలన్నారు. దీంతోపాటు కళ్యాణదుర్గం ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రససింగ్ యూనిట్లు, పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, రాంభూపాల్‌రెడ్డి, సుదీర్, ఉద్దీఫ్, రాజేష్, చెలిమప్ప, ప్రదీప్, వివిధ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు వసంత్‌కుమార్, గంగాధర, నాగరాజు, కృష్ణమూర్తి, వసంత నగేష్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్



విద్యార్థులతో మాట్లాడుతున్న వైసిపి విద్యార్థి విభాగం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్ డిమాండ్ చేశారు. 'హాస్టల్లో బాట' కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక దోనిముక్కల రోడ్డులో ఉన్న కెజిబివి హాస్టల్‌ను వైసిపి విద్యార్థి విభాగం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై రెండూ నెలలు పూర్తి కావస్తున్నా హాస్టల్ విద్యార్థులకు ఇప్పటి వరకూ దోమతెరలు, దుప్పట్లు, ట్రంకు పెట్టెలు అందించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. విద్య కోసం రూ.వేల కోట్లు విడుదల చేశామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, ట్రంకు పెట్టెలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అలాగే కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని, నాణ్యత కలిగిన ఆహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షులు మణికంఠ, ఉపాధ్యక్షులు అశోక్, నాయకులు శీన, లడ్డు పవన్, శివ, తదితరు పాల్గొన్నారు.



వినతిపత్రం చూపుతున్న రైతులు

వ్యాపారిపై రైతుల ఫిర్యాదు

బొమ్మనహాల్ : మిర్చి పంట తీసుకుని మోసం చేసి పారిపోయిన వ్యాపారిపై మండల పరిధిలోని గోవిందవాడ, దేవగిర గ్రామాల రైతులు మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము పండించిన మిరప పంటను ఓ రైతు క్వింటా రూ.13వేల చొప్పున కొనుగోలు చేశాడన్నారు. దీంతో దాదాపు 36 మంది రైతులకు రూ.1.80 కోట్ల వరకూ ఇవ్వాలన్నారు. ఒక్క గోవిందవాడలోనే నలుగురు రైతులకు రూ.20 లక్షలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈనేపథ్యంలో కనిపించకుండా పోయాడని వాపోయారు. ఎంత వెతికినా కనిపించకపోవడంతో చేసేది లేక ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు అందుకున్న సిఐ వెంకటరమణ విచారించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వసతిగృహంలో అదనపు గదులు నిర్మించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని బిసి బాలికల సంక్షేమ కళాశాల వసతి గృహంలో అదనపు గదులను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ, నవీన్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీల్లో చేపట్టిన సర్వే కార్యక్రమంలో భాగంగా మంగళవారం బిసి సంక్షేమ బాలికల కళాశాల వసతిగహాన్ని నాయకులు సందర్శించారు. విద్యార్థినుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతిగృహంలోని ఇరుకుగదుల్లో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గదుల కొరతతో వంటగది, హాలులో నిద్రిస్తున్నారని చెప్పారు. హాస్టల్లో వసతి కరువై పలువురు విద్యార్థినులు కళాశాలలో చదువులు ఆపేసి టీసీలు తీసుకుని ఊళ్లకి వెళ న్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వసతి గహ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

75శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు సరఫరా

శింగనమల : మండలంలోని పాడి రైతులకు 75శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు వెటర్నరీ డాక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల సౌకర్యార్థం అన్ని రైతు సేవాకేంద్రాల్లో గడ్డి విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పివికెకె'లో జాబ్‌మేళా



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

అనంతపురం : అనంతపురంలోని పివికెకె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ విభాగానికి చెందిన ఆరుగురు విద్యార్థులు నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ఉద్యోగావకాశాలు పొందారు. మంగళవారం కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ భానుకిరణ్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు 'గ్రాడ్యుయేట్ ట్రైనీ ఇంజినీర్' హోదాలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల్లో పని చేసే అవకాశాన్ని పొందారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.4.5 లక్షలతోపాటు ఆహారం, వసతి వంటి సదుపాయాలను కంపెనీ కల్పిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ విష్ణుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

పుట్లూరు : శింగనమల నియోజకవర్గ పరిధిలోని పేదలకు మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం అనంతపురంలోనిఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలువురు బాధితులకు రూ.14,84,931 నిధులు మంజూరైనట్లు తెలిపారు. పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరు వేసేందుకు పూజ చేస్తున్న పుల్లారెడ్డి

పుట్లూరు : మండల కేంద్రంలో నూతన బోరు వేసి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. పుట్లూరుకు చెందిన పుల్లారెడ్డి తన సొంత నిధులు వెచ్చించి దాదాపు 1,150 అడుగుల లోతు బోరు వేయించాడు. బోరులో పుష్కలంగా నీరు పడటంతో మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది.

బాలికలు రక్త పరీక్షలు చేయించుకోవాలి

బుక్కరాయసముద్రం : బాలికలు తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని కొర్రపాడు ఆరోగ్య కేంద్రం వైద్యులు ఇందిరా ప్రియదర్శిని సూచించారు. 'రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం'లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కొర్రపాడులో ఉన్న డాక్టర్ అంబేద్కర్ బాలికల రెసిడెంట్ పాఠశాలలో బాలికలకు కళ్లతోపాటు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థినులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా హిమోగ్రోబిన్‌తోపాటు రక్తహీనత వివరాలు తెలుస్తాయన్నారు. అందుకు అనుగుణంగా మందులు వాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మోహన్ బాబు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, డిప్యూటీ ఆరోగ్య అధికారి పర్వీన్, స్టాఫ్‌నర్స్ మాధవీలత, ల్యాబ్ టెక్నీషియన్ కరుణాకర్, ఎఎన్ఎంలు వరలక్ష్మి, ఆదిలక్ష్మి, మల్లేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పిలు రామహారిక, నాజీయా, కల్పన, శిల్ప, ఆశాలు హరిత, తిరుపాలమ్మ, రాములమ్మ, సరస్వతి, ఊర్మిళ, ధరణి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు : ఆర్‌డిఒ



మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం టౌన్ : ఎరువులు, పురుగుల మందులు పంపిణీలో డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఆర్‌డిఒ వసంతబాబు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఎడిఎ యల్లప్ప ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి పొందిన ఎరువుల విత్తనాలు మాత్రమే విక్రయించాలన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారులు శ్రవణ్‌కుమార్, పృథ్వీసాగర్, వాసుకిరాణి, విజయ్‌కుమార్, గోపాల్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'కళలతో ప్రజా చైతన్యం'



జెండాను ఎగురవేస్తున్న కళాకారులు

అనంతపురం కలెక్టరేట్ : వివిధ రంగాల కళల ద్వారా ప్రజా చైతన్యం తీసుకురావొచ్చని ప్రజా నాట్యమండలి నాయకులు తెలిపారు. అనంతపురం నగరం శ్రీశ్రీ నగర్ కామ్రేడ్ వీరన్న భవనంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభం అయ్యాయి. ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు, గాయకులు జగన్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, భజన బందాలు, కోలాటాలు తదితర కళలు, కళాకారులు ఉన్నారన్నారు. ఇటీవల ప్రాచీన వృత్తులు, కళలు కనుమరుగవుతున్నాయని చెప్పారు. ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్లకు యువత బానిసలుగా మారుతున్నారన్నారు. జిల్లాలో సాంస్కృతిక రంగంలో కళాకారులకు కొదువలేదన్నారు. కళల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడం కోసం ప్రజానాట్యమండలి ఎంతో కృషి చేస్తోందన్నారు. విప్లవ గీతాలు, సామాజిక చైతన్య గీతాలు ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తుందని, భవిష్యత్తులోనూ ఇదే ఒరవడి కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా గైడ్ ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా నాయకులు ఎర్రిస్వామి, ఈశ్వర్, లక్ష్మీనారాయణ, పుల్లన్న, బ్రహ్మయ్య, నాగేంద్ర, కృష్ణవేణి, అశ్వని, చంద్రిక పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి

తాడిపత్రి రూరల్ : మండలం ఆలూరు గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వినోద్ కుమార్ (26) అనే వ్యక్తి ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆలూరు గ్రామానికి చెందిన వినోద్ కుమార్ వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్‌పై వెళ ుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తాడిపత్రి నుంచి అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిందితుడు అరెస్టు

గుంతకల్లు : ద్విచక్ర వాహనంపై వచ్చి మహిళల మెడలోని బంగారు గొలుసుల చోరీలకు పాల్పడిన నిందితుడిని మంగళవారం స్థానిక కొనకొండ్ల రోడ్డులోని భీమా పార్క్ వద్ద అరెస్టు చేసినట్లు 1వ పట్టణ సిఐ మనోహర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..కంబదూరు మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన ఎనుముల మారుతీప్రసాద్ ఒంటరిగా ఉన్న మహిళల మెడలోని బంగారు గొలుసులను ద్విచక్ర వాహనంపై వచ్చి చోరీలు చేసేవాడన్నారు. ఇందులో భాగంగా స్థానిక ఆలూరు రోడ్డులోని సాయిబాబా గుడి సమీపంలో నివాసముంటున్న రాయల పుష్పావతి, విజయనగర కాలనీలోని బోయ మల్లీశ్వరి, గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ మెడల్లోని బంగారు గొలుసులను చోరీ చేశాడు. దీంతో డిఎస్పీ శ్రీనివాస్ ఆదేశాలతో మూడు పోలీసు బృందాలు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టగా కొనకొండ్ల రోడ్డులోని భీమా పార్క్ వద్ద ఉన్నాడన్న పక్కా సమాచారంతో ఎస్సై కొండయ్య తమ సిబ్బందితో దాడులు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడి నుంచి రూ.7.50 లక్షల విలువజేసే 71 గ్రాముల మూడు బంగారు గొలుసులు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు వివరించారు.

జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు

కళ్యాణదుర్గంటౌన్ : వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో కళ్యాణదుర్గం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త రంగయ్య ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను జగన్‌కు వివరించారు. జగన్‌ను కలిసిన వారిలో వైసిపి లీగల్‌సెల్ నాయకుడు హనుమంతురెడ్డి, మండల కన్వీనర్లు గోళ్ల సూరి, చంద్రశేఖర్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు యాదవ్, వైస్ కన్వీనర్ మల్లికార్జున, ఎస్సీసెల్ తాలుకా అధ్యక్షులు తిప్పేస్వామి, తదితరులు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎంపిపి

బెలుగుప్ప : సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గుండ్లపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజర పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా ప్రజల సమస్యల పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి బి.మల్లికార్జున, సచివాలయం సిబ్బంది సంయుక్త, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు చట్టాన్ని తీసుకురావాలి

పుట్లూరు : కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వడంతోపాటు సమగ్ర కౌలు చట్టాన్ని తీసుకురావాలని ఎపి కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం కడవకల్లు గ్రామంలోని సచివాలయంలో వీఆర్వో శ్యామలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వీటి రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. అలాగే సమగ్ర చట్టం తీసుకొచ్చి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల అధ్యక్షులు ఎన్.గోపాలకృష్ణ, నాయకులు బాల నరసింహుడు, కౌలు రైతులు పెద్ద మునయ్య, చిన్న నరసింహుడు, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి సర్వే

పుట్లూరు : స్వామిత్వ కార్యక్రమం (సర్వే అఫ్ విలేజెస్ అబడి అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్)పై మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ఆగస్టు 1వ తేదీ నుంచి విలేజ్ టీం ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసి నివేదికను ఇవ్వాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో పుట్లూరు, యల్లనూరు మండలాల ఇఒఆర్‌డిలు శివప్రసాద్, మనోహర్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ తప్పనిసరి

పెద్దపప్పూరు : వీఆర్వోలు, విహెచ్‌ఎలు సమన్వయంతో ఈక్రాప్ బుకింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఉద్యానవన అధికారిణి ఉమాదేవి, వ్యవసాయ అధికారి మహిత కిరణ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ శ్వేత ఆధ్వర్యంలో ఈ క్రాప్ బుకింగ్‌పై విఆర్‌ఒలు, విహెచ్‌ఎతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్‌ఒలు, విహెచ్‌ఎలు సమన్వయంతో ఈక్రాప్ బుకింగ్ త్వరగా పూర్తి చేయాలన్నారు. రైతుల సమక్షంలో సర్వే నెంబర్ల ప్రకారంగానీ, ఎల్‌పి నెంబర్ల ప్రకారంగానీ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, విలేజ్ వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

హామీలను విస్మరించిన 'కూటమి' ప్రభుత్వం

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం

కూటమి నాయకులు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారని మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. మంగళవారం నగరంలోని 32వ డివిజన్ పరిధిలో 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పేదల జీవితాల్లో చీకట్లు నింపారన్నారు. ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమన్నారు. కూటమి వైఫల్యాలను ఇంటింటా వెళ్లి ఎండకడతామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, వైసిపి నాయకులు దాదాఖలందర్, భరద్వాజ్, కాకర్ల శీనా, శోభ, ఉషా, కుమార్, కిరణ్, సంతోష్, సుకుమార్, అశోక్, పెన్నోబిలేశు, జయరాం, జయరామ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండలంలోని పులసలనూతుల, కర్ణపూడికి, గడ్డంనాగేపల్లి, వెంకటాంపల్లి, మద్దలపల్లి, నాయణపల్లి గ్రామాల్లో మైసిపి మండల కన్వీనర్ ఖాదర్‌వలి ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా


ప్రజలతో మాట్లాడుతున్న మేయర్ వసీం

ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జెడ్పీ వైస్‌ఛైర్మన్ వేదాంతం నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరావు, ఎంపిటిసిలు శంకర్‌యాదవ్, రాజారెడ్డి, ఉపసర్పంచు శ్రీరాములు, నడిమిదొడ్డి లక్ష్మిరెడ్డి, నాగలింగారెడ్డి, నిలువురాయి వెంకటేష్, చాములూరు సూర్యనారాయణ, మన్నీల శివయ్య, నాయకులు దాడితోట బాషా, బాలనాగి బయన్న, అమీర్‌బాషా, గుత్తి గోపాల్‌రెడ్డి, బాలనాగి రామాంజనేయులు, జిలాన్‌బాషా, భాస్కర్‌నాయుడు, సిద్దిరాచర్ల సర్పంచు రామాంజనేయులు, తుంపెర పక్కీరెడ్డి, ముచ్చుకుంటపల్లి వెంకట నారాయణరెడ్డి, కేసేపల్లి రామాంజనేయులు, చిలముకూరి గోపాల్, ఈడిగ ఆదినారాయణ, రంగాపురం పాపయ్య, యలపనాయుడు, నిలువురాయి రవికుమార్, యువ నాయకులు సొహెల్, సాయి, ప్రవీణ్, హరినాథ్‌రెడ్డి, నౌషాద్, దాదాపీర్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండలంలోని తూట్రాళ్లపల్లి గ్రామంలో వైసిపి మండల కన్వీనర్ సంజీవరాయుడు ఆధ్వర్యంలో మంగళవారం 'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ముత్యాలరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, నాగరాజు, రామాంజనేయులు, గుర్రప్ప, రామచంద్రారెడ్డి, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని కడవకల్లు, రామలింగయ్యపల్లి గ్రామాల్లో వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నరసింహారెడ్డి, రమణయాదవ్, సర్పంచ్ రామాంజనేయులు, మడుగుపల్లి నాగేశ్వరరెడ్డి, నాగముని, రామకేశవ, కుళ్లాయిరెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, పెద్దోడు, నాగేశ్వర్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, చిన్నతిరుపాల్‌రెడ్డి, వివేక్, ప్రభాకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పరిశీలన


గారబాయి కొట్టాల కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎంపిపి మమతాదేవి

నార్పల : మండల కేంద్రంలోని గారబాయి కొట్టాల కాలనీలో ఉన్న డ్రెయినేజీలను ఎంపిడిఒ మమతాదేవి మంగళవారం పరిశీలించారు. డ్రెయినేజ్‌ల్లో చెత్త పేరుకుపోయి అధ్వాన్నంగా తయారైందని స్థానికుల ఫిర్యాదతో స్థానిక అధికారులతో కలిసి పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు స్థానికులు సహకరించాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదన్నారు. ఎక్కువగా డ్రెయినేజీల్లో చెత్త వేయడం వల్ల కాలువలు మూసుకుపోయి డ్రెయినేజీ నీరు రోడ్లపై పారుతుందన్నారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు.

పిఎఫ్, ఇఎస్ఐ కోరుతూ వినతి

గుత్తి : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు పిఎఫ్, ఇఎస్ఐ వర్తింజేచేయాలని నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ విద్యుత్ మీటర్ లీడర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభ పిళ్ళైకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో తాము పని చేస్తున్నామని కాంట్రాక్టర్ పిఎఫ్, ఇఎస్ఐకి తక్కువగా అమౌంట్ చెల్లిస్తున్నారని చెప్పారు. ఆరోగ్య సమస్యలతో ఇఎస్ఐ ఆసుపత్రి కి వెళ్తే వర్తించడం లేదన్నారు. కాంట్రాక్టర్‌తో చర్చించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మీటర్ రీడర్ల యూనియన్ రంగస్వామి,మదన్మోహన్, కష్ణ,చక్రపాణి,ఉపేంద్ర, శశి, దాదా, మహేంద్ర, మల్లి, వాసు, సిపిఐ నాయకులు జి.రామదాసు, మధు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండల పరిధిలోని కందుకూరు, జంగాలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్–2025లో వేరుశనగ వేసిన రైతులు 40–45 రోజుల్లోపు జిప్సం వేసుకున్నట్లయితే కాయల సైజు, నాణ్యత, పెరిగి నూనె శాతం, దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి శ్రీనివాసులు, మండలం వ్యవసాయ అధికారి ఎ.వెంకట్‌కుమార్, గ్రామ ఉద్యాన సహాయకులు మల్లికార్జున, ఎంపిఇఒలు నవనీత, రైతులు పాల్గొన్నారు.


సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుట్లూరు : మండల పరిధిలోని అరకటివేముల గ్రామంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రవి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలు, డ్రోన్, కౌలు రైతు గుర్తింపు కార్డులు, తదితర అంశాలను వివరించారు. ముఖ్యంగా మొక్కజొన్న పంటను పరిశీలించి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయిని, ఆత్మా బిటిఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఎటిఎం హిమబిందు, గౌతం, హెచ్‌ఇఒ రామాంజి, రైతు సేవా కేంద్రం సిబ్బంది రష్మిత, సుమతి, సుధ, రైతులు పాల్గొన్నారు.


మొక్కజొన్న సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గౌరవ వేతనాలపై తీర్మానం చేయకుంటే సమావేశమెందుకు?

మండల మీట్ నుంచి సభ్యుల వాకౌట్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండల సమావేశంలో సభ్యుల గౌరవ వేతనాలపై తీర్మానం చేయకుంటే సమావేశం ఎందుకు నిర్వహించాలని సభ్యులు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కొండన్న ఆధ్వర్యంలో ఎంపిపి విద్యావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలోనే 18 నెలలుగా తమకు గౌరవ వేతనాలు రాలేదని, దీనిపై తీర్మానం చేయాలని వైస్ ఎంపిపి అరుణ్‌కుమార్ పట్టుబట్టారు. ఈయనకు ఎంపిటిసిలు సురేష్, శ్యామల, కోఆప్షన్ సభ్యుడు దిలావర్ మద్దతుగా మాట్లాడారు. గౌరవ వేతనాలపై తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపాలని డిమాండ్ చేశారు. ఇందుకు ఎంపిడిఒ స్పందిస్తూ ఈ విషయంపై గతంలోనే ఉన్నతాధికారులకు నివేదించామని


అసంతృప్తి వ్యక్తం చేస్తూ బయటికి వెళ్తున్న వైస్ ఎంపిపి అరుణ్‌కుమార్

చెప్పుకొచ్చారు. ఇది స్టేట్ పాలసీ అని సమావేశం జరిగేలా సభ్యులు చూడాలని ఎంపిడిఒతోపాటు తహశీల్దార్ నాగరాజు కోరారు. దీంతో ఆగ్రహించిన నలుగురు సభ్యులు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా సభ్యులతోపాటు వైస్ ఎంపిపి అరుణ్‌కుమార్ వెళ్తుండగా ఎంపిపి విద్యావతి భర్త శివారెడ్డి బుజ్జగించే ప్రయత్నం చేశారు. అంతేగాకుండా తమతోనే ఎంపిపి కూడా రావాలని వైస్ ఎంపిపి కోరగా ఆమె మౌనంగా వేదికపైన కూర్చుండిపోయారు. సుమారు గంటకుపైగా సమావేశం బహిష్కరణ ఘట్టం సాగింది. అనంతరం బహిష్కరించిన సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయకుండా, సభ్యులకు తగిన గౌరవం ఇవ్వకుండా మండల పరిషత్ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అందుకోసమే సమావేశాన్ని బహిష్కరించామని తెలిపారు. ఇకపోతే బుధవారం తిరిగి సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.